# బడిబాట పట్టాలి.. 100 శాతం హాజరు సాధించాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, వసతులు కల్పించాలి
- ఆకస్మిక తనిఖీల్లో ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ కె.హరిత దిశానిర్దేశం



**ఉద్యమ కెరటం, కాగజ్ నగర్ :** ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ, విద్యార్థులందరూ పాఠశాలలకు వంద శాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత పిలుపునిచ్చారు. మంగళవారం కాగజ్ నగర్ పట్టణంలోని పెట్రోల్ బంక్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, హాజరు రిజిస్టర్లు, వంటశాల, సరుకుల నిల్వ గదులతో పాటు పాఠశాల పరిసరాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు వంద శాతం హాజరుతో పాఠశాలలకు వచ్చేలా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని స్పష్టం చేశారు. ఎవరైనా విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరైతే, కేవలం రిజిస్టర్లకే పరిమితం కాకుండా అందుకు గల కారణాలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని సూచించారు. గైర్హాజరవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడి, పిల్లలు క్రమం తప్పకుండా బడికి వచ్చేలా ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు అవసరమైన పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించి, కార్పొరేట్ స్థాయికి దీటుగా నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులకు సాధారణ విద్యాబోధనతో పాటు ముఖ్యంగా ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులపై ప్రత్యేక పట్టు సాధించేలా తర్ఫీదు ఇవ్వాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

### బడి బయట పిల్ల వాడికి కలెక్టర్ హితవు

తనిఖీ ముగించుకుని వెళ్తున్న సమయంలో బడి బయట తిరుగుతున్న ఒక విద్యార్థిని కలెక్టర్ కె.హరిత గమనించారు. వెంటనే ఆ బాలుడిని దగ్గరకు పిలిచి, పాఠశాలకు ఎందుకు వెళ్లడం లేదనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. చదువు యొక్క ప్రాధాన్యతను, భవిష్యత్తును వివరిస్తూ, ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లాలని ఆ విద్యార్థికి ప్రేమతో హితవు పలికారు. పిల్లలను బడికి పంపాల్సిన బాధ్యత తల్లి దండ్రులపై కూడా ఉందని గుర్తుచేశారు.

### మెనూ ప్రకారం భోజనం.. వర్షా కాలంలో పారిశుద్ధ్యం

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యానికి కూడా అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ రుచికరమైన, శుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని స్పష్టం చేశారు. ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా పాఠశాలల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు, ఈగలు చేరకుండా ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

### గురుకుల పాఠశాల సందర్శన..



### అధికారులకు హెచ్చరికలు

అనంతరం పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను కలెక్టర్ హరిత సందర్శించారు. అక్కడ వంటశాల, సరుకుల నిల్వ గదిని పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు హెచ్చరికలు జారీ చేశారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. కాలం చెల్లిన (ఎక్స్‌పైరీ) సరుకులను వంట తయారీలో ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదని, విద్యార్థుల ఆరోగ్యంతో ఆడుకుంటే సహించేది లేదని గట్టిగా ఆదేశించారు. వర్షాకాలం కావడం వల్ల విద్యార్థుల ఆరోగ్యంపై వార్డెన్లు సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని, గురుకుల పాఠశాలకు ఇంకా రాని విద్యార్థుల తల్లి దండ్రులతో మాట్లాడి వారిని వెంటనే పాఠశాలకు రప్పించేలా కృషి చేయాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమాల్లో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ జయప్రద, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# చేపల లోడ్ తో వెళ్తు న్న ట్రాలీ బోల్తా

## ఇద్ద రికి గాయాలు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం టేకులపల్లి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చేపల లోడ్తో వెళ్తున్న అశోక్ లేలాండ్ ట్రాలీ బోల్తా పడింది. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ను తప్పించే ప్రయత్నంలో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ట్రాలీ డ్రైవర్తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం కారణంగా కొంతసేపు ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ను క్రమబద్ధీకరించారు. అనంతరం ప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# టీబీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

## మాదాపూర్లో ఉచిత ఎక్స్రే శిబిరం ప్రారంభం



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** మండలంలోని మాదాపూర్ గ్రామంలో క్షయ (టీబీ) వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉచిత ఎక్స్రే వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ షేక్ ఇమ్రాన్ షాదుల్లా ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని వేధిస్తున్న టీబీ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలందరూ ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీర్ఘకాలిక దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి టీబీ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా పరీక్షలు, మందులు, వైద్య సేవలు అందిస్తోందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ శిబిరంలో స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కేయూ తెలుగు విభాగంలో నూతన తెలుగు సిలబస్కు ఆమోదం



**ఉద్యమ కెరటం, వరంగల్:** కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) తెలుగు విభాగంలో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ మూడో, నాలుగో సెమిస్టర్ల తెలుగు పాఠ్యాంశాల నూతన సిలబస్కు పాఠ్య ప్రణాళిక సంఘం (బోర్డ్ ఆఫ్ స్టడీస్) ఆమోదం తెలిపింది. తెలుగు విభాగంలో మంగళవారం పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులు డాక్టర్ చిర్ర రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డిగ్రీ మూడో, నాలుగో సెమిస్టర్ల తెలుగు సిలబస్ను సభ్యులు సమగ్రంగా చర్చించి రూపొందించారు. అనంతరం నూతన సిలబస్ను బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశంలో ప్రవేశపెట్టి సభ్యుల ఆమోదం పొందారు. ఈ సందర్భంగా బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ మాట్లాడుతూ నూతన సిలబస్ విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సాహిత్య అవగాహన, సృజనాత్మకతతో పాటు ఉపాధి సంబంధిత సామర్థ్యాలను పెంపొందించేలా రూపొందించామని తెలిపారు. ఈ సమావేశంలో తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ మామిడి లింగయ్య, బి.సీతారాం, కె.భారతి, ఎం.వెంకటరమణ, పాఠ్య ప్రణాళిక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రామకృష్ణారావుకు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, తలమడుగు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిటైర్డ్ ఐఏఎస్ కె.రామకృష్ణారావు మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా హైదరాబాద్లో ఆయనను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ నాయకుడు, తలమడుగు మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణారావుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గోక గణేష్ రెడ్డి మాట్లాడుతూ రామకృష్ణారావు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్గా పనిచేసిన కాలంలో జిల్లా అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. జిల్లా ప్రజల గుండెల్లో ఆయన సుపరిచితుడిగా, నిగర్విగా చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తుచేశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కూడా ఆయన అత్యంత సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారని, ఆయన శేషజీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఘనంగా సహకార వారోత్సవాల 5వ వార్షికోత్సవం

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** జిల్లా కేంద్రంలో సహకార వారోత్సవాల 5వ వార్షికోత్సవం, ఎఫ్‌పీఓ అవగాహన సదస్సు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సహకార సంఘం చైర్మన్ అలీ బిన్ హైమద్ అధ్యక్షత వహించగా, జిల్లా సహకార అధికారి డీసీఓ, వరంగల్ ఫ్యాకల్టీ నాగనారాయణ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంస్థల ప్రాధాన్యతను వివరిస్తూ, సహకార సంఘాలు, ఎఫ్‌పీఓలు సమన్వయంతో పనిచేస్తేనే రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, రైతుల ఆదాయాన్ని పెంచే మార్గాలపై సదస్సులో విస్తృతంగా చర్చించారు. రైతుల సంక్షేమం కోసం సహకార రంగ ప్రతినిధులంతా ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.




# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రత తగ్గించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

## కాగజ్నగర్లో బీఆర్ఎస్ ధర్నా

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రతను తగ్గించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కాగజ్నగర్ పట్టణంలోని బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్కు ప్రస్తుతం ఉన్న దానికంటే మరింత పటిష్టమైన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రవీణ్ కుమార్ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలతో మమేకమవుతున్న నాయకుడని పేర్కొన్నారు. అలాంటి నాయకుడి భద్రతను తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రస్తుతం ఉన్న భద్రతను కొనసాగించడంతో పాటు అవసరమైతే మరింత బలోపేతమైన భద్రత కల్పించాలని కోరారు.



ప్రజా సమస్యలను లేవనెత్తే నాయకులపై రాజకీయ కక్షసాధింపు ధోరణితో వ్యవహరించడం తగదని, ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం భద్రతకు సంబంధించిన నిర్ణయాన్ని పునఃసమీక్షించి, డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్కు మెరుగైన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గ నాయకులు, మహిళా నాయకురాళ్లు, మండల అధ్యక్షులు, సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

# అర్హులైన ప్రతి ఓటరు పేరు ఎస్ఐఆర్ జాబితాలో ఉండేలా చూడాలి

- ఏఎంసీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి

**ఉద్యమ కెరటం, వరంగల్:** ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా అప్రమత్తంగా వ్యవహరించాలని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం అనాజ్పూర్ గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలు, బీఎల్ఏలతో మాట్లాడి ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఓటరు వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఎలాంటి అర్హుల పేరు కూడా జాబితా నుంచి తప్పిపోకాకుండా, తప్పులు లేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని, అనర్హుల పేర్లను తొలగించాలని అధికారులకు సూచించారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు ఇంటికి వచ్చినప్పుడు అవసరమైన వివరాలను అందించాలని, రెండు కలర్ పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా సమర్పించాలని ప్రజలకు సూచించారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏళ్ల బాల్రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ పాలెం శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు గుజ్జ రాంరెడ్డి, కావలి వెంకటేష్ ముదిరాజ్,



ఎరుకలి బాలకృష్ణ గౌడ్, ఇంజమూరి కవిత మహేందర్, గువ్వల భరత్ కుమార్, రాగని అరవింద్, నాయకులు కండెగాని మహేందర్, తాటిపల్లి శ్రీశైలం గౌడ్, ఏర్పుల శ్రీశైలం, పాలెం శివసాయి గౌడ్, ఏర్పుల ప్రవీణ్, శ్రీధర్, విఘ్నేష్, బీఎల్ఓ అరుణ పాల్గొన్నారు.

# ఓటరు నమోదు ప్రక్రియపై నిర్ల క్ష్యం వద్దు

- టిపిసిసి ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ సేడ్మకి ఆనంద్ రావ్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత బీఎల్ఏలు, బీఎల్ఓలపై ఉందని టీపీసీసీ ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ సేడ్మకి ఆనంద్ రావ్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కేబీ కాలనీ గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. స్థానిక బీఎల్ఏలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల నమోదు, ఓటర్ మ్యాపింగ్ విధానాన్ని



పరిశీలించి అధికారులకు, పార్టీ నాయకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించాలని కోరారు. ఓటును కోల్పోవడం అంటే కేవలం ప్రజాస్వామ్య హక్కును మాత్రమే కాకుండా, రేషన్ కార్డు, పెన్షన్ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఇంటిని బీఎల్ఓలు మూడుసార్లు సందర్శిస్తారని, ఓటర్లు తమ పూర్తి, సరైన వివరాలను అందించి నమోదు ప్రక్రియకు సహకరించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు విలువైనదని, నాయకులు కూడా ఈ ప్రక్రియను బాధ్యతగా తీసుకుని క్షేత్రస్థాయిలో ప్రతి ఓటరుకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మాలే బోరిగామ గ్రామంలోని యువత, స్థానిక నాయకులు ఓటర్లలో చైతన్యం కల్పించి అర్హులైన ప్రతిఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలని కోరారు.

# రమాదేవి సేవలు చిరస్మరణీయం

- టి ఎస్ టి డబ్ల్యూ టి యు జిల్లా అధ్యక్షులు రాథోడ్ రవీందర్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** గిరిజన సంక్షేమ శాఖలో డిప్యూటీ డైరెక్టర్ గా సేవలు అందించి, జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది పదవీ విరమణ చేస్తున్న ఆర్. రమాదేవి సేవలు చిరస్మరణీయమని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు రాథోడ్ రవీందర్ కొనియాడారు. మంగళవారం హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్‌లో నిర్వహించిన ఘన సన్మాన కార్యక్రమంలో సంఘం నాయకులు ఆమెను శాలువా, బొకేలతో సత్కరించారు. కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఆమె పనిచేసిన కాలానికి సంబంధించిన అరుదైన ఫోటోలతో కూడిన ఫోటో ఫ్రేమ్‌ను ఆమెకు జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా రాథోడ్ రవీందర్ మాట్లాడుతూ, ఆర్. రమాదేవి గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు, విద్యార్థుల సంక్షేమానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆసిఫాబాద్ జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకుని గిరిజనుల అభ్యున్నతికి తోడ్పడ్డారని గుర్తుచేశారు. మానవతా దృక్పథం, క్రమశిక్షణ గల ఆమె ఉద్యోగ జీవితం అందరికీ ఆదర్శమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం కూడా ఆమె ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ సర్వేష్ రెడ్డి, రిటైర్డ్ పీజీ హెడ్‌మాస్టర్ దివిటి సుధాకర్, జీసీసీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్,టి ఎస్ టి డబ్ల్యూ టి యు రాష్ట్ర



ప్రధాన కార్యదర్శి జి. అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నైతం కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడావి గోపాల్, కొట్నాక్ యాదవ్రావు, కోడెం రవీందర్, కుడ్మేత అనంత్, కోర్వేత మనోహర్, మాడావి పోచాని, జిల్లా మహిళా కార్యదర్శులు కొట్నాక్ హంసబాయి, మంగవతి, సీఆర్‌టీ సంఘం నాయకులు వినంత్‌రావు, కొమరల్లి శంకర్, జర్పుల విజేష్, వామన్‌రావు, హరికృష్ణ, రాథోడ్ బదులాల్, అజ్మీరా ఈశ్వర్ మరియు పలువురు ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొని రమాదేవికి శుభాకాంక్షలు తెలిపారు.

# సర్పంచ్ తనిఖీతో సరండిలో వెలుగులోకి పలు లోపాలు

**ఉద్యమ కెరటం, వాంకిడి:** మండలంలోని సరండి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, గ్రామపంచాయతీ కార్యాలయాల పనితీరుపై గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం గ్రామ సర్పంచ్ మొహర్లే బాపూజీ నిర్వహించిన ఆకస్మిక తనిఖీలో పలు అంశాలు వెలుగులోకి రావడంతో అధికారుల పనితీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సర్పంచ్ గ్రామ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, బోధన, మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల విధుల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి బోధన సక్రమంగా జరుగుతోందా, ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విధులకు గైర్హాజరైన విషయం గుర్తించిన సర్పంచ్, గ్రామస్థుల నుంచి తరచూ గైర్హాజరవుతున్నారనే ఫిర్యాదులు రావడంతో మండల విద్యాధికారిని ఫోన్లో సంప్రదించి వివరణ కోరారు. దీనిపై అధికారులు ప్రధానోపాధ్యాయుడు అధికారిక సెలవులో ఉన్నట్లు సమాచారం ఇచ్చారు. అయితే ఈ విషయంపై స్పష్టత కోసం మండల విద్యాధికారి కార్యాలయాన్ని మీడియా ప్రతినిధులు సందర్శించగా,



విద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలో సిబ్బంది మాత్రమే ఉన్నారు. ఆయన పాఠశాలల తనిఖీల్లో ఉన్నట్లు సిబ్బంది, ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా అధికారికంగా పూర్తి వివరాలు అందకపోవడంతో స్థానికుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానోపాధ్యాయుడి సెలవు విషయాన్ని ముందుగానే గ్రామ విద్యా కమిటీకి, లేనియెడల గ్రామస్థులకు తెలియజేశారా..? ప్రత్యామ్నాయ బోధన ఏర్పాట్లు చేశారా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదే సమయంలో గ్రామపంచాయతీ కార్యాలయ నిర్వహణపై కూడా గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శి సమయపాలన పాటించడం లేదని, ప్రభుత్వ పనుల కోసం వచ్చే ప్రజలు గంటల తరబడి వేచి చూసినా అందుబాటులో లేకపోతున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల నార్లాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అవసరమైన సంతకాల కోసం వచ్చినప్పటికీ కార్యదర్శి రాకపోవడంతో నిరాశగా వెనుదిరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యదర్శిని ఫోన్ ద్వారా సంప్రదించేందుకు చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదని పేర్కొన్నారు. ప్రజలకు సమయానికి ప్రభుత్వ సేవలు అందకపోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే వారు పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ తనిఖీలో వెలుగులోకి వచ్చిన అంశాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడి హాజరు, మండల విద్యాధికారి పర్యటనలు, గ్రామపంచాయతీ కార్యదర్శి విధుల నిర్వహణపై పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి అవసరమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అధ్యాపకులే మార్గదర్శకులు

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా ఇంటర్మీడియేట్ కార్యాలయంలో గణితశాస్త్ర (మ్యాథ్స్) లెక్చరర్లకు నిర్వహించిన ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి వారిని ఉన్నత శిఖరాలకు చేర్చాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తమ బోధనా నైపుణ్యాలను నిరంతరం మెరుగుపర్చుకోవాలని సూచించారు. అధ్యాపకుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం నెలరోజుల పాటు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ శిక్షణలో నేర్చుకున్న ఆధునిక బోధనా విధానాలను తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలు చేసి ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఐఈఓ జాదవ్ గణేష్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ టి.అరుణ్ కుమార్, వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల



ప్రిన్సిపాల్స్, కేజీబీవీ అధ్యాపకులు, జూనియర్ లెక్చరర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దళిత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** దళిత సామాజిక వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. గతనెల 15న నిర్వహించిన సమావేశంలో ఎస్సీ సంఘాల ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలపై శాఖల వారీగా చేపట్టిన చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ



ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అర్హులైన ఎస్సీ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు, లేబర్ కార్డుల మంజూరులో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతిఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం తదితర శాఖల అధికారులు క్షేత్రస్థాయి సమస్యలను నిశితంగా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఆర్ఎస్. చిత్రు, రాజేశ్వర్, డీఆర్ఓ స్రవంతి, జెడ్పీ సీఈఓ రవి, డీఆర్డీఓ రవీందర్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి బి.సునీత కుమారి, ఈడీ మనోహర్, వివిధ శాఖల అధికారులు, ఎస్సీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

**అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** మున్సిపల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టి ఘన వ్యర్థాల నిర్వహణలో నాణ్యత పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం మందమర్రి మున్సిపల్ పరిధిలోని చత్లపూర్ గ్రామంలోని డంపింగ్ యార్డును మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, ఇతర అధికారులతో కలిసి సందర్శించి ఘన వ్యర్థాల నిర్వహణ విధానాలను పరిశీలించారు. ఈ



సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజూ ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు. వ్యర్థాల నిర్వహణలో మెరుగైన చర్యలు చేపట్టి పారిశుధ్య నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి ఇటీవల అకౌంట్స్ విభాగంలో నీరు చేరిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, కార్యాలయ భద్రత, నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యాలయ ఆవరణలోని మీసేవ కేంద్రాన్ని సందర్శించి సేవలు పొందుతున్న ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ సేవల కోసం వచ్చే ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ వసంత్, పర్యావరణ ఇంజనీర్ గోపీకృష్ణ, రెవెన్యూ అధికారి కృష్ణప్రసాద్, మున్సిపల్ మేనేజర్ రాజేశ్వరి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**నేరడిగొండ పీహెచ్సీని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సాధన వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం నేరడిగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అమలవుతున్న పలు ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించి వైద్య సేవల నాణ్యత, రోగులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ముఖ్యంగా గ్రామాల్లోని హైరిస్క్ గర్భిణీల ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న వైద్య సేవలపై క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధుల నివారణకు చేపట్టాల్సిన ర్యాపిడ్ ఫీవర్ సర్వే, ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. అలాగే టీబీ వ్యాధి నిర్మూలనలో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపడుతున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమాల పురోగతిని కూడా పరిశీలించారు. ఆమె వెంట పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ సద్దాం, స్వర్ణలత, హెల్త్ సూపర్వైజర్ సంతోష్, సిబ్బంది ఉన్నారు.

# పదవీ విరమణ పొందిన హెడ్ ఓవర్మన్కు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, తాండూర్:** బెల్లంపల్లి ఓసీ–2 ఎక్స్టెన్షన్లో హెడ్ ఓవర్ మెన్గా విధులు నిర్వహించిన రాఘవరెడ్డి 43 సంవత్సరాల సుదీర్ఘ సేవ అనంతరం మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా బీపీఏ ఓసీ–2 మైన్లోని కృషి భవన్లో సింగరేణి అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆయనకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ రాఘవరెడ్డి తన సేవా కాలంలో క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తించి సహచరులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆయన పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీపీఏ ఓసీ–2 ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉమాకాంత్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, కాలరీ మేనేజర్ మహేష్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ప్రశాంత్, పిట్ సెక్రటరీ ఆశిష్, ఏరియా వర్క్షాప్ ఉద్యోగులు, ఏరియా స్టోర్స్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

# బాధితుడి ఇంటికెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితుడికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.60వేల ఆర్థిక సాయం అందజేసి మానవతా దృక్పథాన్ని చాటారు. బోథ్ నియోజకవర్గంలోని రోడ్డు సావర్గం గ్రామానికి చెందిన రాథోడ్ విజయ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ జాదవ్ కళ్యాణి మహేందర్, సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేయించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బాధితుడికి రూ.60వేల ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. ప్రస్తుతం విజయ్ నడవలేని పరిస్థితిలో ఉండటంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మంగళవారం గ్రామ సర్పంచ్ జాదవ్ కళ్యాణి మహేందర్ బాధితుడి ఇంటికి వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రాథోడ్ విజయ్ మాట్లాడుతూ ఆపద సమయంలో తనకు అండగా నిలిచి, ఇంటికే చెక్కు పంపించి అందజేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్, గ్రామ సర్పంచ్ జాదవ్ కళ్యాణి మహేందర్కు కృతజ్ఞతలు తెలిపారు.

# మార్కెట్ కమిటీ చైర్మన్ను కలిసిన జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన బోరంచు శ్రీకాంత్రెడ్డిని జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి దయానంద్రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మావలలోని చైర్మన్ నివాసానికి వెళ్లి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు




తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో యువజన సంక్షేమం, క్రీడల అభివృద్ధి, మార్కెట్ కమిటీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఇరువురు చర్చించారు. యువతకు మరిన్ని అవకాశాలు కల్పిస్తూ క్రీడారంగ అభివృద్ధికి సమన్వయంతో పని చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# ఉపాధ్యాయుడు రవివర్మకు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, భీంపూర్:** మండలంలోని పిప్పలకోటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిప్యుటేషన్పై విధులు నిర్వహిస్తూ తన సేవలతో విద్యార్థులు, గ్రామస్థుల అభిమానాన్ని చూరగొన్న ఉపాధ్యాయుడు రవివర్మ మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆయనకు ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ దాసరి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై రవివర్మను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యుటేషన్పై వచ్చినప్పటికీ రవివర్మ పాఠశాలను సొంత విద్యా సంస్థగా భావించి విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించి గ్రామ ప్రజల ఆదరణ పొందారని, ఆయన సేవలు పిప్పలకోటి గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయని అన్నారు. ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి అతిథిగా పాల్గొని రవివర్మ సేవలను ప్రశంసించారు. మాజీ సర్పంచ్ కేమా గంగయ్య, రేణికుంట్ల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సతీష్, కదిరి వెంకటేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రముఖులు, విద్యార్థులు పాల్గొని ఉద్యోగ విరమణ పొందిన రవివర్మకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎంఈఓ ఉదయ్ రావు సేవలు చిరస్మరణీయం



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** గుడిహత్నూర్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) రాథోడ్ ఉదయ్ రావు విద్యారంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడసం దౌలత్రావు కొనియాడారు. మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన ఎంఈఓ ఉదయ్రావును తొడసం దౌలత్రావు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తొడసం దౌలత్రావు మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉదయ్ రావు అంకితభావంతో పనిచేశారని ప్రశంసించారు. క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించి ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజల ఆదరణ పొందారని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం సంపూర్ణ ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవిస్తూ సమాజానికి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగ్నాథ్ అప్ప, లింగాపూర్ ఉప సర్పంచ్ మోతివార్ గణపతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాథోడ్ రమేష్, రామ్కిషన్, ఆడే జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయ భవనం మంజూరు

- జిల్లా ఇన్చార్జి మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**ఉద్యమ కెరటం, జైనూర్:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలానికి రూ.2.50 కోట్ల వ్యయంతో నూతన తహశీల్దార్ కార్యాలయ భవనం మంజూరు కావడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జాధవ్ లోకేందర్, మండల నాయకుడు ఆత్రం అనిల్కుమార్ మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక వసతులతో కూడిన తహశీల్దార్ కార్యాలయ భవనాన్ని ప్రభుత్వం మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ఈ భవనం నిర్మాణంతో మండల ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రావడంతో పాటు, అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. భవన మంజూరుకు ప్రత్యేక చొరవ తీసుకున్న ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. భవన నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించి, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలి

- ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్
- తల్లాడలో బీఎల్ఓలకు సర్ కార్యక్రమంపై అవగాహన



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ఖమ్మం జిల్లా తల్లా డ మేజర్ పంచాయతీతో పాటు తల్లాడ మండల పరిధిలోని మిట్టపల్లిలో సర్ కార్యక్రమంపై బీఎల్ఓలకు నిర్వహించిన అవగాహన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రతి బీఎల్ఓ పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా మ్యాపింగ్ ఫారమ్ల పరిశీలనలో అప్రమత్తంగా వ్యవహరించి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఓటరు జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేందుకు అధికారులు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. అనంతరం బీఎల్ఓలు, గ్రామ కార్యదర్శులు విధి నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు, జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన ప్రతినిధులు, బీఎల్ఓలు, గ్రామ కార్యదర్శులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది





- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా స్వాలంబన సాధించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా చేయూతనిస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం జైపూర్ మండలం గంగిపల్లి గ్రామంలో రూ.15లక్షల డీఎంఎఫ్టీ నిధులతో నిర్మించిన గ్రామైక్య సంఘ భవనాన్ని, ఇందిరమ్మ గృహాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా శక్తి పథకం ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా రూ.21వేల కోట్ల రుణాలను మంజూరు చేశామని తెలిపారు. రుణాలను సకాలంలో చెల్లించే సంఘాలకు మరింత ఆర్థిక సహాయం అందిస్తామని పేర్కొన్నారు. మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు పాఠశాల యూనిఫాంల తయారీ, పెట్రోల్ బంకుల నిర్వహణ వంటి రంగాల్లో అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నామని చెప్పారు. చెన్నూర్ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, వచ్చే నెలాఖరుకు దాదాపు వెయ్యి ఇళ్లు పూర్తికానున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సహాయ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లలో అర్హులైన నిరుపేదలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, మహిళా సంఘాల కార్యకలాపాల కోసం జిల్లాలో మహిళా శక్తి భవనాల ఏర్పాటు చేపడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. అంతకుముందు మంత్రి, జిల్లా కలెక్టర్ గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించారు. జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, పూరించిన ఫారాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. బీఎల్ఓలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేసి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధిలో భాగంగా నాబార్డ్ క్లస్టర్ ఏర్పాటు

**లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** గ్రామీణ, వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమంలో భాగంగా మంచిర్యాల కేంద్రంలో నాబార్డు క్ల స్టర్ ఏర్పాటు చేయడం జరిగిందని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి అన్నారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలో నాబార్డ్ జనరల్ మేనేజర్ గణపతి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ చేతన్, డీఎఓ సురేఖ, డీబీఎహెచ్ఓ యాకుబ్ రెడ్డి, ఏడీసీసీ సీఈఓ రవి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఉపేందర్, డీఐసీజీఎం శ్రీనివాస్ లతో కలిసి నా బార్డ్ క్ల స్టర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మాట్లాడుతూ గతంలో ఆదిలాబాద్ నుంచి క్లసర్ నడపడంతో దూరాభారం అయ్యేదని, ఇపుడు మంచిర్యాలలో ప్రారంభించడం ద్వారా నాబార్డ్ సేవలు మరింత చేరువ అవుతాయని తెలిపారు. గ్రామీణాభివృద్ధికి, రైతుల సంక్షేమానికి, వ్యవసాయ అభివృద్ధికి మార్గదర్శక సంస్థగా పనిచేస్తుందని, గ్రామీణ మౌలిక వసతులు, వాటర్షెడ్ అభివృద్ధి, మహిళా సాధికారత, స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, జీవనోపాధి కార్యక్రమాల ద్వారా లక్షలాది గ్రామీణ కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకు వస్తుందని తెలిపారు. గ్రామీణాభివృద్ధే దేశాభివృద్ధికి పునాది అనే లక్ష్యంతో నాబార్డు కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీకే అధికారి సాద్వి రెడ్డి, మత్స్యశాఖ అధికారి భవ్యశ్రీ, వాసన్ ఏకలవ్య ధన్ ఫౌండేషన్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.




# విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



- తాండూర్ కేజీబీవీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ చంద్రయ్య

**ఉద్యమ కెరటం, తాండూర్:** విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్, ఇన్చార్జి డీఈఓ పి.చంద్రయ్య అన్నారు. తాండూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటశాలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. అలాగే పాఠశాల ఆవరణ పరిశుభ్రత, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, కొనసాగుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, భోజన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్, మండల విద్యాధికారి దుర్గం శ్రీనివాస్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ జె.కవిత, పాఠశాల సిబ్బంది ఉన్నారు.



# వెల్ఫేర్ బోర్డు పథకాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించొద్దు

• సీఐటీయూ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పగించే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం వేంసూరు మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం నాయబ్ తహశీల్దార్ లక్ష్మణ్కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు మళ్లించడం సరికాదని అన్నారు. ట్రైల్ బ్లేజర్ సంస్థకు బీమా ప్రీమియం పేరుతో కార్మికుల నిధులను అప్పగించడం ద్వారా సంక్షేమ పథకాల లక్ష్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. సిఎస్ సి సంస్థ ద్వారా ఆరోగ్య పరీక్షల పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ కార్మికులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని విమర్శించారు. ఆరోగ్య సహాయాన్ని నేరుగా వెల్ఫేర్ బోర్డు ద్వారానే అందించాలని, పెండింగ్లో ఉన్న క్లెయిమ్లను వెంటనే పరిష్కరించాలని, ట్రైల్ బ్లేజర్ సంస్థ వద్ద పెండింగ్లో ఉన్న మరణ సహాయాలను విడుదల చేయాలని, ఆన్లైన్ సర్వర్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే సాధారణ మరణ సహాయాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు, ప్రసూతి, వివాహ కానుకలను రూ.30వేల నుంచి రూ.1లక్షకు పెంచాలని కోరారు. 55 ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.6వేల పింఛన్, వారి పిల్లలకు స్కాలర్షిప్లు, సొంత ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేంసూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ మీరావలి, సారంగుల మల్లేశ్వరరావు, కాకర్ల శ్రీను, తిప్పిశెట్టి శివ, కందిమల్ల నాగరాజు, పిన్నబోయిన శివ, బింగి మధుసూదన్ రావు, మునియ్య, పరిగడుపు చంటి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

• కేజీబీవీ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా గ్రంథాలయ చైర్మన్





**ఉద్యమ కెరటం, వాంకిడి:** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం విద్యార్థులకు బెడ్షీట్లు పంపిణీ చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. త్వరలో ప్రభుత్వం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఇంటర్మీడియట్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఉచితంగా నీట్, ఐఐటీ వంటి పోటీ పరీక్షలకు కోచింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రతిభతో ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శివచరణ్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రైషా, పాఠశాల సిబ్బంది, మండల పార్టీ అధ్యక్షుడు నారాయణ, సర్పంచ్ కృష్ణాజీ, మేఘుజీ తదితరులు పాల్గొన్నారు.

# లెండిగూడలో ఉచిత మెగా టీబీ పరీక్షా శిబిరం

• మొక్కలు నాటి ఆరోగ్య సందేశం ఇచ్చిన వైద్య బృందం



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని గౌరి కొలాంగూడ గ్రామపంచాయతీ పరిధిలోని లెండిగూడ గ్రామంలో మంగళవారం ఉచిత మెగా టీబీ పరీక్షా శిబిరం నిర్వహించారు. గ్రామంలో అస్తమా, శ్వాసకోశ సంబంధిత సమస్యలు అధికంగా ఉన్న నేపథ్యంలో మండల వైద్యాధికారి డాక్టర్ మేజర్ మురళీకృష్ణ చొరవతో, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సీతారాం, జిల్లా టీబీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వినయ్ సహకారంతో ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో హ్యాండ్హెల్డ్ ఎక్స్రే యంత్రం ద్వారా గ్రామస్తులకు ఉచితంగా ఊపిరితిత్తుల పరీక్షలు నిర్వహించారు. అనుమానితులకు తదుపరి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యులు టీబీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరం ముగిసిన అనంతరం గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై వైద్య బృందం సందేశం ఇచ్చారు. మొక్కలను పెంచండి.. వ్యాధులను అరికట్టండి" అనే నినాదంతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆత్రం అయ్యూబాయి, మాజీ సర్పంచ్ సిడాం భీమ్రావు, పంచాయతీ కార్యదర్శి పద్మారావు, టీబీ సూపర్వైజర్ సంతోష్రాజు, సీహెచ్ఓ రాజు, పీహెచ్ఎన్ రత్నకుమారి, హెచ్వీ ప్రసన్న, ఏఎన్ఎం సావిత్రి, హెచ్ఏ పరశురామ్, లాల్సింగ్, రేడియోగ్రాఫర్ వరుణ్, పీఎం జన్మన్ స్టాఫ్ నర్సులు నందిని, భీమ్బాయి, ఎల్టీఏ భరత్, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.





# తెలంగాణ ఉద్యమకారులకు అండగా భూ పోరాటం

• ఉప్పల్ బగాయత్ ధర్నాను విజయవంతం చేయండి



**ఉద్యమ కెరటం,ఆసిఫాబాద్:** నీళ్లు, నిధులు, నియామకాల సాధన కోసం తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులకు గత ప్రభుత్వాలు, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం కూడా తీరని అన్యాయం చేశాయని తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆసిఫాబాద్ జిల్లా ఇన్చార్జ్ కిర్మిల్ల వినోద్ చారి , సిర్పూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ కావేటి సబిత మనోహర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రం సిద్ధించి 13 సంవత్సరాలు కావస్తున్నా.. ఉద్యమకారులకు ఇస్తామన్న 250 గజాల ఇంటి స్థలాల హామీ ఇప్పటివరకు నెరవేరలేదని, ఒక్క సెంటు భూమి కూడా కేటాయించకపోవడం దారుణమని వారు మండిపడ్డారు. ఉద్యమకారులకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని నిరసిస్తూ, తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీన హైదరాబాద్లోని ఉప్పల్ బగాయత్ ప్రాంతంలో భారీ భూ పోరాటానికి నాంది పలికారు. ఉద్యమకారులందరికీ వెంటనే 250 గజాల ఇంటి స్థలాలు కేటాయించాలని, ఆ స్థలాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, వారి కుటుంబాలకు ప్రత్యేక సంక్షేమ పథకాలను తక్షణమే అమలు చేయాలని పార్టీ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మహోల్కర్ అశోక్, మహమ్మద్ మోసిన్, నర్సింగోజు సాయి, మహమ్మద్ అబ్బుతాలిబ్, మాచర్ల శ్రీనివాస్, నైతం తిరుపతి, ఆత్రం వినోద్, కరుణాకర్, పెంటయ్య, శ్రీనివాస్, శ్యామ్ రావు, మొయినుద్దీన్ పాల్గొన్నారు.

# గర్భిణీ, బాలింతలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార కిట్ల పంపిణీ



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ ఆదేశాల మేరకు ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి, ఏడవ వార్డు సభ్యుడు ఎండి. జుబేర్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, పోషకాహార పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని తల్లి, శిశు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ గ్రామపంచాయతీ ఈఓ దొండ దివాకర్, ఐసీడీఎస్ తాండూర్ సూపర్వైజర్ స్వరూప, అంగన్వాడీ టీచర్ లలిత, అంగన్వాడీ సిబ్బంది, లబ్ధిదారులు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

# మథుర లాభానా సమాజ్ సమస్యలపై కలెక్టర్కు వినతి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా మథుర లాభానా సమాజ్ కమిటీ ప్రతినిధులు మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి తమ సంఘానికి సంబంధించిన పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్కు వెళ్లిన ప్రతినిధి బృందం సంఘం ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను ఓపికగా విన్న కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, వాటిని పరిశీలించి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మథుర లాభానా సమాజ్ జిల్లా అధ్యక్షుడు సాబ్లె అమర్సింగ్, ప్రధాన కార్యదర్శి అజడే కేవల్సింగ్, ఉపాధ్యక్షుడు పద్వాల్ సర్దార్సింగ్, సలహాదారులు చోపాడే సూరజ్సింగ్, పెల్లే హుషార్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# 108 అంబులెన్స్లో సురక్షిత ప్రసవం

## ఆడ శిశువుకు జన్మనిచ్చిన గర్భిణి



**ఉద్యమ కెరటం, జైనూర్:** అత్యవసర వైద్య సేవల ప్రాముఖ్యతను మరోసారి 108 అంబులెన్స్ సిబ్బంది చాటిచెప్పారు. ఆస్పత్రికి తరలిస్తుండగా గర్భిణికి పురిటి నొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్స్లోనే సురక్షితంగా ప్రసవం నిర్వహించి తల్లి, నవజాత శిశువు ప్రాణాలను కాపాడారు. జైనూర్ మండలంలోని చింతకర్ర గ్రామానికి చెందిన పూర్కా అనసూయకు మంగళవారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన 108 ఈఎంటి సీహెచ్ రవి అంబులెన్స్ పైలెట్తో కలిసి ఆమెను కేరమెరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే పురిటి నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో ఈఎంటి రవి ఏమాత్రం తడబడకుండా అంబులెన్స్లోనే సురక్షితంగా ప్రసవం నిర్వహించారు. దీంతో గర్భిణీ పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం తల్లి, నవజాత శిశువును ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించి వైద్యుల పర్యవేక్షణలో చేర్పించారు. ప్రస్తుతం తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు. అత్యవసర పరిస్థితిలో సమయస్ఫూర్తితో వ్యవహరించి సురక్షిత ప్రసవం నిర్వహించిన 108 ఈఎంటి సీహెచ్ రవి, అంబులెన్స్ పైలెట్ సేవలను గర్భిణి కుటుంబ సభ్యులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# ముమ్మరంగా సాగుతున్న ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా సర్వే



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఇచ్చోడ మండలంలో ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇచ్చోడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఇచ్చోడ గ్రామ సర్పంచ్ జలైజాకు, బోథ్ నియోజకవర్గ మైనార్టీ చైర్మన్ ముస్తఫా తదితర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఓటర్ల జాబితా సర్వేను పరిశీలించారు. సర్వే నిర్వహణ, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియపై అధికారులతో మాట్లాడి పురోగతిని తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా బీఎల్ఓలు నిబంధనల ప్రకారం పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఓటర్లు కూడా సర్వేకు సహకరిస్తూ అవసరమైన వివరాలు, పత్రాలను సమర్పించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు.

